ప్రజాశక్తి
బుధవారం 19 జూన్ 2024

కలెక్టర్ అరుణ్‌బాబును అభినందిస్తున్న అధికారులు

ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయండి

◆ విధుల్లో అధికారుల పనితీరు స్ఫూర్తిదాయకం
◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు అందజేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలియజేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరి అడుగు ఉందని, ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి వ్యయ ఖర్చుకు సంబంధించి తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు సమర్పించాల్సి ఉందన్నారు. ఈనెల చివరి వారంలో వ్యయ పరిశీలకులు వస్తారని, ఆలోగా ఈ వివరాలను అందించాలని తెలియజేశారు. అందరు అభ్యర్థులు అకౌంట్స్ పరిశీలన పూర్తి చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే నివత్తి చేసుకోవాలన్నారు.

అధికారుల పనితీరు స్ఫూర్తిదాయకం

అధికారులు సిబ్బంది కృషి, సహకారంతో జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు కషిచేసి జిల్లాను అభివద్ధి పథంలో నడిపించాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, స్టాటిస్టిక్స్ మానిటరింగ్ కమిటీ అధికారి బాలాజీ పాల్గొన్నారు

వానొచ్చాక కరువు పరిశీలన..!

◆ రబీ కరువు చూసేందుకు కేంద్ర కరువు బృందం రాక ◆ నేడు,రేపు ఉమ్మడి జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023-24 సంవత్సరం రబీ కరువును చూసేందుకు ప్రస్తుత ఖరీఫ్‌లో కేంద్ర కరువు బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాకు రానుంది. బుధ, గురువారాలు రెండు రోజులపాటు కేంద్ర కరువు బృందం ఈ జిల్లాలో పర్యటించనుంది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్‌లో ప్రారంభమై మే నెలతో ముగుస్తుంది. 2023 అక్టోబర్‌లో ప్రారంభమై 2024 మేతో ముగుస్తుంది. ఈ కాలంలో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం జిల్లాలో 14 మండలాలను, సత్యసాయి జిల్లాలో ఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. రబీ సీజన్‌కు కీలకమైన అక్టోబర్, నవంబర్, డిసెంబరు మూడు మాసాల్లో అనంతపురం జిల్లాలో 67.1 శాతం వర్షపాతం లోటుంది. ఆ సీజన్‌లో 139.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 45.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఆ తరువాత జనవరి, ఫిబ్రవరి మాసాల్లోనూ ఒక్క వాన చినుకు నేల రాలలేదు. ఐదు మాసాలుగా తీవ్ర వర్షాభావంతో రబీలో వేసిన పంటలు మొత్తం దెబ్బతిన్నాయి. తాగునీటి సమస్య కూడా ఉత్పన్నమైంది. మొత్తం సార్వత్రిక ఎన్నికలు కూడా అదే సమయంలో రావడంతో కరువును పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పుడు ఖరీఫ్ మొదలయ్యింది. జూన్ నెలాఖరులో వర్షాలు పడిన తరువాత కేంద్ర కరువు బృందం జిల్లాకు విచ్చేస్తోంది. అది కూడా జూన్ నెలలో భారీగా వర్షాలు పడిన విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో పర్యటించనుంది. విడపనకల్లులో ఈ నెలలో ఇప్పటి వరకు పడిన వర్షపాతం 203 శాతం అధికంగా ఉంది. సాధారణ వర్షపాతం 47 మిల్లీమీటర్లు జూన్‌లో ఇప్పటి వరకు పడాల్సి ఉంటే 142.8 మిల్లీమీటర్లు నమోదయింది. వజ్రకరూరు మండలంలో ఏకంగా 609 శాతం అధికంగా వర్షపాతం పడింది. ఇక్కడ సాధారణ వర్షపాతం 29.3 మిల్లీమీటర్లకుగానూ 207.3 మిల్లీమీటర్లు నమోదయింది. ఈ మండలంలో కరువు బృందం పర్యటించనుండటం గమనార్హం. బృందం పర్యటించే ఉరవకొండ, కణేకల్ మండలాల్లోనూ మంచి వర్షపాతమే నమోదయింది. రైతులు పంటలు సాగుకు సమయత్తమవుతున్న సమయంలో కరువు పరిశీలనకు రావడం విమర్శలకు తావిస్తోంది.



నేడు,రేపు కరువు బృందం పర్యటన

కేంద్ర కరువు బృందం నేడు,రేపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. మంగళవారం రాత్రికే కేంద్ర కరువు బృందం అనంతపురం నగరంకు చేరుకుంటుంది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెవెన్యూ భవనంలో కరువుపై సమీక్ష ఉండనుంది. అనంతరం భోజన విరామం తరువాత రెండు బృందాలుగా విడిపోయి ఒక బృందం కర్నూలు జిల్లాకు మరో బృందం రొద్దంకు క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టనుంది. మరుసటి రోజు గురువారం ఉదయం 9.30 గంటలకు విడపనకల్లు మండలం మల్లాపురం, గూళ్యపాలెం గ్రామాల్లో పర్యటించనున్నారు. భోజన విరామం తరువాత ఉరవకొండ మండలం నింబగళ్లు, కణేకల్ మండలం సొల్లాపురం, పెద్దకౌకుంట్ల గ్రామాల్లో పర్యటించనున్నారు. అనంతరం విజయవాడకు కేంద్ర కరువు బృందం వెళ్తుంది.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సునీత

మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. మంగళవారం ఉదయం ఉరవకొండ మండలం, కౌకుంట్ల గ్రామంలోని మంత్రి నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కొంతసేపు నియోజకవర్గాల్లో అభివృద్ధిపై మాట్లాడుకున్నారు. కేశవ్‌కు మంత్రి పదవి రావడంపై పరిటాల సునీత అభినందనలు తెలియజేశారు.



మోటూరు హనుమంతరావుకు నివాళి అర్పిస్తున్న ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ సిబ్బంది

మోటూరు హనుమంతరావుకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడు, సిపిఎం నాయకుడు మోటూరు హనుమంతరావు 23వ వర్థంతి కార్యక్రమాన్ని అనంతపురం ఎడిషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోటూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటూరు హనుమంతరావు అసమాన్య ప్రతిభాసాలి అన్నారు. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడిగా ఆయన విశేష సేవలు అందించారన్నారు. ప్రజాశక్తి సంపాదకునిగానే కాకుండా సిపిఎం నాయకునిగా అనేక ప్రజాపోరాటాలు నిర్వహించారన్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగానూ పని చేసి చట్ట సభల్లో ప్రజావాణిని విన్పించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో అందరూ ముందడుగా వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రొద్దంలో కేంద్ర కరువు బృందం పర్యటన

ప్రజాశక్తి-పెనుకొండటౌన్

రబీ సీజన్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టియల్ టీం నేడు రొద్దం మండలంలో పర్యటిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ సత్య ప్రభ తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రొద్దం మండలంలోని ఆర్ కొట్టాల, చెరుకూరుగ్రామాల్లో పప్పు శెనగ పంట పొలాలను పరిశీలిస్తారన్నారు. కేంద్ర బృందం రైతులతో ముఖాముఖి చర్చలు ఉంటాయని ఏడీ తెలిపారు.

మంత్రిని కలిసిన గోరంట్ల నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను గోరంట్ల మండలం మల్లాపల్లి పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు విజయవాడలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి పదవి దక్కినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి దేవా నరసింహప్ప, ప్రభాకర్, నరసరామ్, గంగిరెడ్డి, రామాంజనేయరెడ్డి, ఫిరోజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి- చిలమత్తూరు

ఉపాధి కూలీలకు పనిముట్టు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సంజీవరాయినిపల్లి, కొత్తచామలపల్లి, చిన్నన్నపల్లి గ్రామాలలో ఉపాధి కూలీల పని ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పూర్తి చేసిన ఉపాధి కూలీలకు గత నాలుగు సంవత్సరాలుగా పనిముట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెంటనే పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలుగు వారాల నుంచి బిల్లులు అందక కూలీలు నానా ఇబ్బందులు పడుతు పనులు చేస్తున్నారని అన్నారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో పని ప్రదేశానికి వాహనాల సహాయంతో వెలుతున్నా రవాణా ఖర్చులు ఇవ్వకుండా కోత విధిస్తున్నారని అన్నారు. తక్షణమే కూలీలకు రావాల్సిన పనిముట్లు, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూలీలు శివకుమార్, నాగేంద్ర, ఆదెప్ప, నరసింహ, కుమార్ తదితరులు పాల్గొన్నారు

సమస్యను వివరిస్తున్న ఉపాధి కూలీలు

21న మార్కెట్ వేలం

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్ నిర్వహణకు ఈనెల 21న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కార్యదర్శి సురేందర్ రెడ్డి తెలిపారు అన్ని షాపింగ్ గదులకు, వివిధ మార్కెట్ల నిర్వహణకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మంత్రి లోకేష్‌ను సన్మానించిన 'సామకోటి'

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిచ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను సత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా కురుబ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం అమరావతిలోని ఉండవల్లిలో గల లోకేష్ నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సత్యసాయి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువగళం రథసారథిగా రాష్ట్రమంతా లోకేష్ చేసిన పాదయాత్ర వృధాగా పోలేదన్నారు. ఈ పాదయాత్రలో వైసిపిరాక్షస అరాచక పాలనను లోకేష్ ఎండగట్టారన్నారు. నియంత పాలనను ప్రజలు సహించలేక కూటమి అభ్యర్థులకు ఘన విజయం అందించారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా నాయకులు బసినేపల్లి పార్థసారథి, బెల్లం తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సత్యసాయి చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి సత్యకుమార్

ర్యాలీలో పాల్గొన్న కూటమి శ్రేణులు

మంత్రి సత్యకుమార్‌కు ఘనస్వాగతం

◆ అనంత జిల్లా సరిహద్దు నుంచి ధర్మవరం వరకు రోడ్‌షో
◆ భారీ గజమాలలతో అభిమానుల ఆహ్వానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, బత్తలపల్లి

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నాడు మొదటి సారి జిల్లాకు విచ్చేసిన సత్యకుమార్‌కు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా సరిహద్దు గుత్తి బాటసుంకులమ్మ ఆలయం నుంచి ధర్మవరం నియోజకవర్గం కేంద్రం వరకు అభిమానులు అడుగడుగునా క్రేన్ల ద్వారా భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అనంతపురంలో శింగనమల, అనంతపురం ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీలో ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి ఓపెన్ టాప్ కారుపై ర్యాలీగా ధర్మవరం చేరుకున్నారు. అనంతపురం, బత్తలపల్లి మీదుగా ధర్మవరం వరకు రోడ్‌షో కొనసాగింది. ధర్మవరం చేరుకోగానే శివానగర్ సర్కిల్ వద్ద నేతన్న విగ్రహానికి సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చేనేత విగ్రహం వద్ద మంత్రి నేలపై సాష్టాంగ నమస్కారం చేసి, మట్టిని నుదిటిపై రాసుకున్నాడు. కళాజ్యోతి సర్కిల్ వద్దనున్న దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అదే మార్గంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చక్రవర్తి థియేటర్ వద్ద సందాబ్రదర్స్ సందారాఘవ, సంధారవి, జింకా బ్రదర్స్ జింకా నాగభూషణ, జింకాగిరి జింకా పురుషోత్తం, పాళ్లెం ప్రసాద్‌లు మంత్రి సత్యకుమార్‌కు బారీ గజమాల వేశారు. అక్కడే భారీకేక్‌ను కట్ చేయించారు. అక్కడి నుంచి నేరుగా మంత్రి దుర్గానగర్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో మొక్కలు నాటారు. రాప్తాడు ఎమ్మెల్యే సునీత, టిడిపి పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, చింతలపల్లి మహేష్ చౌదరి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కోటి సూర్య ప్రకాష్ బాబు, ఆకులేటి వీరనారప్ప, ఉపసర్పంచి కోటి గోపీనాథ్, తెలుగు యువత నాయకులు తాళ్లూరు సతీష్ కుమార్ చౌదరి, ధర్మవరం నియోజవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాస నాయుడుతో పాటు ధర్మవరం నియోజకవర్గంలోని కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి -పెనుకొండ

బాల్య వివాహాలను నిర్మూలించి బాల్యవివాహాల రహిత రెవిన్యూ డివిజన్‌గా పెనుకొండ డివిజన్‌ను తీర్చిదిద్దుదామని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు. మంగళవారం పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ భవన విజయం సమావేశం భవనంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి సమావేశం సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని ఆదేశించారు. ఏ ఒక్క గ్రామంలో కూడా బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. బాల్య వివాహం జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి సరైన సమయంలో వారికి కౌన్సిలింగ్ అందించి పోలీస్ అధికారుల సహకారంతో బాల్య వివాహాలను నిరోధించాలని తెలిపారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక చట్టం పైన నియమ నిబంధనల పైన డిసిపిఒ మహేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, సిడిపివోలు శాంతారెడ్డి , గీతబాయి, బాలల పరిరక్షణ అధికారులు నాగలక్ష్మి, మురళి, పెనుకొండ హిందూపురం, లేపాక్షి, పరిగి, చిలమత్తూరు మండలాల తహశీల్దార్లు, ఎంఇఒలు, ఎంపిడిఒలు ఐసిపిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్య ద్వారానే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో గోపాల నాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించి పిల్లల భవితకు కారణం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మోహన్ బాబు, ప్రధానోపాధ్యాయులు జగదీష్, రెహమాన్, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే

వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు ఆదేశించారు. పట్టణంలోని విశ్రాంతిభవనంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ముందుగా పట్టణములోని నూరు పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి అర్థాంతరంగా నిలిచిపోయిన భవనాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హిందూపురం రోడ్డులోని పాల శీతల కేంద్రంలో పరిశీలించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల భవనంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక విశ్రాంతిభవనములో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ ఐ మధు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆటో డ్రైవర్లకు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం ఆటో డ్రైవర్లు గణేష్ గేట్ వద్ద అడ్డంగా నిలిపి ప్రయాణికులకు, సత్యసాయి భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఆటోలకు కేటాయించిన నిర్ణీత స్థలంలోనే ఆటోలు నిలుపుకోవాలన్నారు. మద్యం సేవించి ఆటోలు నడపడం, వేగంగా నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఇతరులకు ఇబ్బందులు కలిగించకూడదని అన్నారు. నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామాన్యులను కలవరపెడుతున్న కూర'గాయాలు'

హడలెత్తిస్తున్న టమోటా.. ఘాటెక్కిన పచ్చి మిర్చి ధరలు
వీటి బాటలోనే బీన్స్, క్యారెట్, కాకర
కొత్తిమీర కట్ట రూ.60...పుదీన రూ.20...ఆకు కూర కట్ట రూ.10

టమోటా ధర ఒక్కసారిగా ఆకాశంలో ఎక్కి కూర్చుంది..పచ్చిమిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది.. మేమేం తక్కువా అన్నట్లు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం రెండు నుంచి మూడింతలు పెరగడంతో సామాన్య ప్రజలు వామ్మో అంటున్నారు. మార్కెట్‌కు ఐదు వందల రూపాయల నోటుతో వెళితే. సగం సంచి కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిర్చి ధర మార్కెట్లో రూ.100, కాకర రూ.60కి చేరింది. టమోటా రూ.100 నుంచి రూ. 110 మధ్యలో ఉంది. కొత్తిమీర కట్ట రూ. 60కు చేరింది. ఇలా ప్రతి వస్తువు ధర పెరిగి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల సాగు తగ్గిపోవడం, వర్షాలతో తోటలు దెబ్బతినడం ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. మార్కెట్‌కు ఎక్కువగా దిగుబడులు వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

మార్కెట్‌లో విక్రయించడానికి ఉంచిన కూరగాయలు

కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి లేకుండా పోయింది. పెరిగిన ధరల వల్ల కిలో కూరగాయలు కొనేవారు పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎంతో కొంత తక్కువ ధరకు లభిస్తాయనుకుని మార్కెట్‌కు వస్తే ఇక్కడి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీటిని పండించే రైతుకు ఎంత వరకు గిట్టుబాటు ధర లభిస్తుందో గానీ... దళారులు మాత్రం బాగుపడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కూరగాయల ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. కూరగాయలు వారి వంటింట్లో ఉడకనంటూ భీష్మించుకున్నాయి. సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో టమోటాను పట్టుకుంటే దాని ధర హడలెత్తిస్తోంది. పచ్చిమిర్చి ధర ఘాటెక్కి తనను ముట్టుకోవద్దంటోంది. ఇలా ప్రతి కూరగాయ సామాన్యుడిని ముట్టుకోనీయడం లేదు. ఎందుకంటే వాటి ధరలు అంత అమాంతంగా పెరిగి ఆకాశానికి నిచ్చనేశాయి. కనీసం పచ్చడి మెతుకులు తిందామనుకుంటే పచ్చిమిర్చి ధర రూ.100 చేరి అందనంత ఎత్తులో ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో టమోటాల సాగు అధికంగా ఉంది. రెండు నెలల కిందట రైతులకు గిట్టుబాటు ధరలు లేక టమోటాలను రోడ్లపైనే పారబోసి వెళ్లేవారు. ఇటీవల టమోటా ధర బాగా పెరగడంతో ఇదే అదునుగా దళారీలు సొమ్ము చేసుకుంటూ అధిక ధరలకు విక్రయించడం మొదలు పెట్టారు. ఇదేమిటి అంటే కూరగాయల సాగు తగ్గిందని. ధరలు పెరిగాయని చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. గతంలో కిలో టమోటా ధర రూ.5 నుంచి 10 రూపాయలు ఉండగా నేడు ఏకంగా రూ.100 నుండి రూ.110 వరకు చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం తప్పసరి కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు. వంకాయలు గతంలో కిలో రూ.20 నుండి రూ.30 ఉండగా నేడు రూ.40 నుంచి రూ.50లు పలుకుతున్నాయి. మునగ కిలో రూ.120 విక్రయిస్తున్నారు. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.25 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.50కు మార్కెట్లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.60 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేవు. వీటి ధర ఏకంగా సెంచరీ కొట్టింది. ఇక పచ్చిమిరపకాయల మాట ఎత్తుకుంటే కిలో రూ. వంద చొప్పున అమ్మకం సాగిస్తున్నారు. ఇదేమిటి అంటే ఈసారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. బెండకాయ రూ.50, పచ్చిమామిడి రూ.80, చిక్కుడు రూ.80, బూడిద గుమ్మడి ఒకటి రూ.60, తీపి గుమ్మడి రూ.40, క్యారెట్ కిలో రూ.70, బీట్రూట్ రూ.60, ముల్లంగి రూ.60, కాకరకాయ రూ.90, క్యాబేజీ రూ.50, బీన్స్ రూ.140 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక ఆకుకూరల ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూరను తీసుకున్నా రూ.10 ఉంది. ముఖ్యంగా మెంతి ఆకు, పాలకూర, చుక్కాకు, గోంగూర వంటి వాటిని కూడా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఏది



ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. ధరలను నియంత్రించాల్సిన అధికారులు నియంత్రించడం లేదు. ఇది చాలదన్నట్లు తూకాల్లో సైతం మోసాలు జరుగుతున్నాయి. పర్యేక్షించాల్సిన తూనికల కొలతల శాఖ అధికారులు ఏ ఒక్కరూ రైతు మార్కెట్ వైపు చూసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు బజార్లలో, మార్కెట్లలో సందర్శించి కూరగాయల ధరలు తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి

మార్కెట్లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా కూరగాయల ధరలను పెంచేశారు. ఏ కూరగాయనుకొని తినే పరిస్థితులలో లేం. అధికారులు స్పందించి కూరగాయల ధరలను వెంటనే నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలి.

అర్షియా, గృహిణి
హిందూపురం

సంచిలోకి కూడా రావడం లేదు

కూరగాయల ధరలు మండి పోతున్నాయి. వంట చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఏ కూర చేయాలో తోచడం లేదు. ధరలు మండిపోతున్నాయి. నూతన ప్రభుత్వమైనా ధరలు అదుపులోకి తీసుకు రావాడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

సుమంగళ గృహిణి,
హిందూపురం

వ్యాపారులు దోచుకుంటున్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచడంతో రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడంతో నిత్యావసర, కూరగాయల ధరలతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. దీని వల్ల రైతుల కంటే దళారులు ఎక్కువ లాభం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు. దీంతో పాటు మార్కెట్‌పై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో వ్యాపారులు సైతం రైతులను నిలువునా దోచుకుంటున్నారు.

బడా సుబ్బిరెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ కార్యాలయాల తరలింపు అన్యాయం

ప్రజాశక్తి -పెనుకొండ

కర్నూల్ నుండి ప్రభుత్వ కార్యాలయాలను తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాయలసీమ విద్యావంతుల వేదిక పెనుకొండ రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌డిఎ కూటమికి అఖండ మెజారిటీ సమకూర్చిన వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతానికి అభివృద్ధి పథకాలలో ప్రాధాన్యత ఇస్తారని సీమ ప్రజలంతా ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే అందుకు భిన్నంగా ఇప్పటికే నెలకొల్పిన మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్ బోర్డ్, ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ అథారిటీ కార్యాలయాలను అమరావతికి తరలించబోతున్నారనే సమాచారం సీమ ప్రజానీకాన్ని ఆవేదనకు గురి చేస్తుందన్నారు. విశాఖలో ఏర్పాటు చేసిన కెఆర్‌ఎంబి కార్యాలయాన్ని సీమకు తరలిస్తారని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో సీమకు ప్రాధాన్యత ఇస్తారని తలుస్తున్న సమయంలో ఉన్న వాటికే ఎసరు పెట్టడం సముచితం కాదని అన్నారు. గతంలోనూ అనంతపురంకు కేటాయించిన సంస్థను గుంటూరుకు తరలించడానిన ఇక్కడి ప్రజానీకం ఇంకా మరిచిపోలేదన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ విచ్ఛిన్నతకు దారితీస్తుందని తెలంగాణా అనుభవాలను మరచిపోవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు సీమ ప్రజల పక్షాన నోరు విప్పాలని లేకపోతే సీమ ప్రజల ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని బడి ఈడు వయస్సు కలిగిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారులు ఎస్.చాముండేశ్వరీ, బి.సుధాకర్ నాయక్ కోరారు. నేను బడికి పోతా కార్యక్రమం వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అనంతరం స్థానిక విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరాలన్నదే నేను బడికి పోతా అనే కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ఇందుకు మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒ, సిడిపిఒ, పోలీసు, కార్మిక తదితర శాఖల అధికారుల బృందం ఏర్పాటు చేశామన్నారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాలయ విద్యా కార్యదర్శి, సిఆర్‌ఎంటి, ఐఇఆర్‌టి, పిటిఐలు, అంగన్వాడీలతో కూడా బృందాలు వేసి బడిబయటి పిల్లలను గుర్తింపుకు ప్రత్యేక సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులతో పాటు సిఆర్‌ఎంటిలు సునీత, వెంకట రమణ, సౌజన్య, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది మంజుల, చంద్రయ్య, బాలాజీ, సూర్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు జయసుధ, క్రిష్ణ వేణి, సున్నిబేగం తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక ఎంఆర్‌సి భవన్ లో మంగళవారం అధికారులు ఉపాధ్యాయులతో నేను బడికి పోతా అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎంపిడిఒ రామానాయక్, డిప్యూటీ తహశీల్దార్ రవి, ఎంఇఒ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20 తేదీ నుంచి జూలై 13వ తేదీ లోపల ఇంటింటి సర్వే చేసి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లతో మానవ మనుగడ

ప్రజాశక్తి - కదిరి టౌన్

భావితరాల భవిష్యత్తుకు, మానవుని మనగడకు మొక్కలను పెంచుదామని బ్లూ మూన్ విద్యాసంస్థల అధినేత మంచి శివశంకర్, అటవీ శాఖ అధికారి హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వేమన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం హరిత నేస్తం రాయసం హరిప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్నిపాఠశాల ప్రధానోపాధ్యాయులు లియాఖత్ అలీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భాస్కర్ రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఆత్మారెడ్డి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా అసోసి యేషన్ అధ్యక్షులు ఫకద్దీన్, ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్ హరి మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిత నేస్తం నిర్వాహకులు హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న దృశ్యం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను సిఎం చంద్రబాబు రద్దు చేయడం పట్ల మంగళవారం గుత్తిలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు స్థానిక న్యాయస్థానాల సమీపంలో ఉన్న బార్ అసోసియేషన్ భవనం వద్ద కేక్ కోసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ.రత్నం, ప్రధాన కార్యదర్శి నగదాని చంద్రశేఖర్, కార్యదర్శి నవీన్, సీనియర్ న్యాయవాదులు కె.మనోహర్‌బాబు, ఆర్‌వి.చలపతి, నరసింహులు, జెడ్.సతీష్, రసూల్, సుబ్రమణ్యాం, ఖమర్ బేగం, టిడిపి లీగల్ సెల్ సభ్యులు ఫక్రుబాషా, పామిడి శీనా, పి.ఓబులేసు, టి.శీనా, శంకరయ్య, ఆర్‌ఎస్ శీనా, తదితరులు పాల్గొన్నారు.

'కోడెల' ఆత్మహత్యపై విచారించాలి

అనంతపురం : అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యపై విచారించి కారకులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమిసాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యకు మాజీ సిఎం జగనే కారణమన్నారు. ఎందుకంటే వైసిపి అధికారంలోకి వచ్చాక శివప్రసాద్‌పై మోపిన సెక్షన్ల ప్రకారం కేసు ఫైల్ చేసి 10ఏళ్లకు తగ్గకుండా శిక్ష పడేలా జైలుకు పంపాలని జగన్ కుట్ర చేశారన్నారు. అలాగే ప్రజలు సొమ్ముతో కొన్న రూ.కోట్లు విలువజేసే ఫర్నీచర్‌ను తాడేపల్లి ప్యాలెస్‌కి దొంగతనంగా తీసుకెళ్లిన జగన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేలు, జిల్లా టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అల్పాహార విందులో పాల్గొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జిల్లా టిడిపి అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, తదితరులు ఉన్నారు. కాగా హిందూపురం ఎంపీ బికె పార్థసారథిని టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, గ్రంథాలయం సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మోదీన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

డిఎంహెచ్ఒ...

అనంతపురం : ఆరోగ్య వైద్య విద్య, సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక గోల్డెన్ కేఫ్ ఎదురుగా 44 జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో బీసీ కాలనీకి చెందిన దస్తగిరి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి -పెనుకొండ

మండల పరిధిలోని అమ్మవారిపల్లిలో మంగళవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ జాతరలో మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్, వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ప్రసాద్ రెడ్డి, బైపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎంపీ

మండలంలోని అమ్మవారిపల్లిలో జరిగిన జాతరలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె. పార్థసారథి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, శశిభూషణ్, నాయకులు కేశవయ్య, చిన్న వెంకటరాముడు, సిద్దయ్య, రవిశంకర్, లక్ష్మీనారాయణ రెడ్డి, గుట్టూరు బోయ నాగరాజు,ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డ్రెయినేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయం వెనుక ఉన్న కాలనీలో నెలకొన్న డ్రయినేజీ సమస్యను పరిష్కరించారు. కాలనీలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ దుర్వాసన కొడుతున్న నేపథ్యంలో మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపాలిటీ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి సమస్య పరిష్కరించారు. సమస్య త్వరగతిన పరిష్కరించడానికి దోహదపడిన ప్రజాశక్తికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కదిరి ఏరియా హాస్పిటల్‌లో కదిరి డివిజన్ పరిధిలోనిమెడికల్ ఆఫీసర్లకు, సిహెచ్‌ఒలకు నిర్వహిస్తున్న ఐదు రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేంద్ర నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ రిషిత, డెంటల్ సర్జన్ డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, టిఒటి డాక్టర్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు .

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

అధిక సుంకం వసూలుపై ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని పరిగి బస్టాండ్ లో ఉన్న మార్కెట్ లో రైతుల నుండి సుంకం వసూలు చేయడంలో సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేసిన వివిధ కూరగాయలు, ఆకుకూరలను విక్రయించేందుకు వాహనాలలో తీసుకువస్తే సంబంధిత కాంట్రాక్టర్ ఒక్కొక్కరు నుండి ఒక్కో విధంగా సుంకం వసూలు చేస్తూ రైతులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని విమర్శించారు. ఒక వాహనానికి రూ. 80 నుండి రూ. 120 దాకా నిబంధనలకు వ్యతిరేకంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన మహిళ వ్యాపారులను కూడా అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఏ వాహనం నుండి ఎంత సుంకం వసూలు చేయాలన్న గెజిట్ నోటిఫికేషన్ బహిరంగపరచి, మార్కెట్ ముందు బోర్డ్ ఏర్పాటు చేయాలని రైతులు ఆదినారాయణ, రాజప్ప, హరీష్, కిష్టప్ప, చంద్రప్ప తదితరులు డిమాండ్ చేశారు.

సమస్యను వివరిస్తున్న రైతులు

23న పెనుకొండకు మంత్రి సవితమ్మ రాక

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్ర మంత్రి గా ప్రమాణస్వీకారం చేసిన బీసీ సంక్షేమ, చేనేత, టెక్స్ టైల్స్ శాఖ మంత్రి సవితమ్మ మొదటి సారిగా పెనుకొండ నియోజకవర్గానికి ఈనెల 23 వ తేదీన రానున్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి సవితమ్మకు స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ నుంచి మంత్రి సవితమ్మ బెంగళూరు కు చేరుకుంటారు. అక్కడినుండి రోడ్డు మార్గంలో బాగేపల్లి మీదుగా పెనుకొండకు చేరుకుంటారు. పెనుకొండ ఎమ్మెల్యే గా మొదటి సారి గెలిచి మంత్రిగా సవితమ్మ పెనుకొండ కు రానుండడంతో పార్టీ శ్రేణులు స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇదిలావుండగా మంత్రి సవితమ్మను కలిసేందుకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవాడకు క్యూకట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత, టెక్స్ టైల్ శాఖ మంత్రిగా సవితమ్మ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి విజయవాడలోనే వుండడంతో అధికారులు, నియోజకవర్గంలోని నాయకులు ఆమెను కలుస్తున్నారు. మంగళవారం బీసీ సంక్షేమ,చేనేత శాఖ,టెక్స్ టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత , కమిషనర్ నాయక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లేపాక్షి , హ్యాండ్‌లూం ఎండీ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఇతర అధికారులు, పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల తదితర మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సవితమ్మను కలిశారు.అదే విధంగా మంత్రిని కళ్యాణ్ మిత్రలు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కి కళ్యాణ్ మిత్రలు తమ సమస్యలను వివరించి, వినతి పత్రం సమర్పించారు. జగన్ ప్రభుత్వం కళ్యాణ్ మిత్ర లు చాలా ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 2500మందిని కళ్యాణ మిత్రులుగా నియమించారన్నారు. అప్పట్లో ఎన్నికల కోడ్ వచ్చే వరకు చంద్రబాబు సిఎంగా ఉన్నన్ని రోజులు చేసిన పెళ్లిళ్ల కు డబ్బులు ఇచ్చారని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి తమతో 18నెలలు పనులు చేయించుకొని డబ్బులు ఇవ్వలేదన్నారు.మంత్రి మాట్లాడుతూ కళ్యాణ మిత్రల సమస్యను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు కళ్యాణమిత్రలు పాల్గొన్నారు.

స్వాగతం పలికేందుకు కూటమి శ్రేణుల ఏర్పాట్లు

ఘనంగా దండు మారెమ్మ జాతర

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో దండు మారెమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న గ్రామ జాతర కావడంతో ఇతర రాష్ట్రాల నుండి భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా టిడిపి నాయకులు మారుతిప్రసాద్, సోమప్ప ప్రవీణ్ రెడ్డి, తిలక్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్షతగాత్రుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి గాండ్లపెంట

మండల కేంద్రంలోని ఇటీవల విద్యుత్ షాక్ తో గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మేకల నారాయణ అనే వ్యక్తిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం పరామర్శించారు. అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు అప్పిరెడ్డి వెంకటరమణారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌వి. సికిందర్, మాజీ సర్పంచి కాకర్ల రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీ పిలుస్తోంది'

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని గలిబి పల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మూడు సంవత్సరాలు పూర్తయిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని ఈసందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రత్నమ్మ, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.